క్లుప్తంగా

రేపు మహా పడిపూజ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు తిరుపతయ్య గౌడ్, శ్రీనివాసులు తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, మధ్యాహ్నం నైవేద్యం, మంగళహారతి తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం సామూహిక మహా పడిపూజ, జంగిరెడ్డి కళాబృందం ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

నవాబుపేట: మండలంలోని కారుకొండలో ఎనిమిది నెలల క్రితం పోలీసు రాముడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వం అందించే రూ.4.50లక్షల బీమా చెక్కును మృతుడి భార్య యాదమ్మకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకుడు భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

కార్మికుల ముందస్తు అరెస్ట్



దేవరకద్ర: తమ సమస్యలు పరిష్కారం కోసం శనివారం అమిస్తాపూర్ వెళ్తున్న టీయూసీఐ నాయకులు సాంబశివుడుతో పాటు పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సాంబశివుడు మాట్లాడుతూ గతంలో కార్మికులు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 43 రోజులు సమ్మె చేశారు. ఆనాడు సమ్మెకు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి మా ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏడాదికి గడిచినా పరిష్కరించలేదని ఆరోపించారు.

భజరంగ్‌దళ్ గోరక్ష ప్రముఖ్‌గా సందీప్



చిన్నచింతకుంట: భజరంగ్‌దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్‌గా చిన్నచింతకుంటకు చెందిన సందీప్ నాయుడును శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబుబ్‌నగర్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన భజరంగ్‌దళ్ సమావేశంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆసంఘాల జిల్లా నాయకులు సందీప్ నాయుడును ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ కండువాను కప్పి అభినందించారు. ఈ సందర్భంగా సందీప్ నాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి భజగరంగ్ దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్‌గా ఎన్నుకున్నందుకు అందరికీ రుణపడి ఉంటానన్నారు. గోవుల రక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

పీహెచ్‌సీలో యోగా శిక్షణ



దేవరకద్ర: స్థానిక పీహెచ్‌సీలో శనివారం యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉచిత శిక్షణ తరగతుల్లో పైలట్ ప్రాజెక్టు కింద దేవరకద్రను ఎంపిక చేశారని యోగా ట్రినర్ సురేష్ తెలిపారు. యోగాతో వివిధ అనారోగ్య సమస్యలను దూరం అవుతాయని అన్నారు. దేవరకద్రలో పురుషులకు ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు, మహిళలకు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు

జడ్చర్ల టౌన్: ప్రజాపాలన విజయోతవ్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మంజులాదేవి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులను తీసుకురావాలని హెచ్‌ఎంలకు పిలుపునిచ్చారు. విజేతలకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపించాల్సి ఉంటుందన్నారు. రెన్యూబల్ ఎనర్జీ అన్న అంశంపై పోటీలు ఉంటాయని ఆమె వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్: ఎలాంటి అనుమతుల్లేకుండా అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి వాగు నుంచి శుక్రవారం అర్ధరాత్రి వేళ ఓ ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ ఓనర్ పారిపోగా ట్రాక్టర్‌ను పోలీస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

దారులన్నీ అమిస్తాపూర్ వైపే

- ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చిన రైతులు, అభిమానులు
- ఆయా రూట్లలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు



దేవరకద్ర నుంచి అమిస్తాపూర్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకద్ర: ఉమ్మడి జిల్లాలోని అన్ని దారుల నుంచి పెద్దఎత్తున వాహనాలు అమిస్తాపూర్ వైపునకు తరలివచ్చాయి. రైతు పండుగ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచివచ్చిన రైతులు, అధికారులు ఇక్కడ ఏర్పాటుచేసిన ఆధునిక పద్ధతులతో కూడిన వ్యవసాయ స్టాళ్లను సందర్శించారు. చివరి రోజు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రైతుపండుగ సదస్సుకు హాజరు కావడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీఎత్తున పార్టీ శ్రేణులు, రైతులు తరలి వచ్చారు. ఆర్టీసీ బస్సులతో పాటు, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులను, ఇతర ప్రైవేట్ వాహనాల్లో కార్యకర్తలు, అభిమానులను అమిస్తాపూర్‌కు తరలించారు. మహబూబ్‌నగర్ చుట్టుపక్కల ఉన్న రూట్లన్నీ వాహనాలతో రద్దీగా కనిపించాయి. వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పార్కింగ్‌కు తరలించారు. ఎక్కడి రూట్ల నుంచి వచ్చిన వాహనాలకు ఆయా రూట్లలోనే పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి గండేడ్ మండలాల నుంచి

మహమ్మదాబాద్/గండేడ్: రైతుపండుగ కార్యక్రమానికి ఉమ్మడి గండేడ్ మండలాల నుంచి శనివారం మధ్యాహ్నం నుంచి రైతులు అమిస్తాపూర్‌కు తరలివెళ్లారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, ముకుందం ఉన్నారు.

నవాబుపేట: మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. శనివారం మండలంలో ప్రతి గ్రామంలో నుంచి రైతులు ప్రత్యేక వాహనాల్లో రైతుపండుగకు హాజరైనట్లు తెలిపారు. నాయకులు రాజేష్, ఖాజా, అంజనేయులు, కుమార్, మైనోద్దీన్, వెంకటయ్య పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రం నుంచి దాసరి వెంకటయ్య ఆధ్వర్యంలో, అమ్మాపూర్ నుంచి శ్రీనువాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం సభకు తరలివెళ్లారు.

రైతు పండుగను వీక్షించిన రైతులు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డి గ్రామంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతువేదికలో రైతులు వీక్షించారు. రైతులకోసం 25వేల రైతులకు రైతు రుణమాఫీ చేసిందని సీఎం ప్రకటించడంపై రైతులు సంతోషం వ్యక్తంచేశారు. ఏఈఓలు దీపిక, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



హన్వాడ నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బైక్ ర్యాలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'రైతు పండుగ'కు మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో బైక్‌లపై ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, పార్టీ నాయకులు ఖాజాపాషా, గంజి వెంకట్రాములు, అంజద్ పాల్గొన్నారు.

'రైతు పండుగ' విజయవంతం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు పండుగ' విజయవంతమైంది. రైతు స్టాళ్లలో ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పైకి ఎక్కి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విజయ దరహాసం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన రైతు పండుగకు వచ్చిన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కలిసి ఆత్మీయంగా పలకరించారు. అనంతరం రైతు పండుగ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ స్టాల్స్ సందర్శించారు. ఎమ్మెల్యే యెన్నంతో కలిసి వారు సెల్ఫీలు దిగారు. అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ స్టాల్స్ చూసిన తర్వాత మీ ఆలోచనలు అనుభవాలు రాసి భద్రపరచుకోవాలని సూచించారు. వాటిని మీ పాఠశాలకు వచ్చి చూస్తానని ఆయన విద్యార్థులకు తెలిపారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో జడ్చర్ల

జడ్చర్ల టౌన్: జడ్చర్ల శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంది. సిగ్నల్‌గడ్డపై మూడు మార్గాల్లో, క్రాస్ రోడ్డు వద్ద రెండు మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. సీఎం సభకు పెద్దఎత్తున బస్సులు రావటంతో పాటు ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. సిగ్నల్‌గడ్డపై రైల్వే బ్రిడ్జికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా క్రాస్‌రోడ్డు వద్ద అదే పరిస్థితి. పట్టణంలో రోడ్డు పనులు నడుస్తుండటంతో ఒకేమార్గంలో వాహనాల రాకపోకలు కొనసాగించాల్సి వస్తోంది. రైల్వే బ్రిడ్జి ఇరుకుగా ఉండటం వాహనదారులు అడ్డదిడ్డంగా రావటంతో రెండువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సీఐ ఆదిరెడ్డి, ఇద్దరు ఎస్ఐలు, పోలీసులు అక్కడికి చేరుకొని రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. 108 వాహనం ట్రాఫిక్‌జాంలో నిలిచిపోయింది. పోలీసులు 108 వాహనం వెళ్లేందుకు దారి ఇప్పించారు.



సిగ్నల్‌గడ్డ రైల్వే బ్రిడ్జి వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

హాస్టళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి




మహమ్మదాబాద్: పాఠశాలలను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహమ్మదాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలో, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణ, తిరుపతి, శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం కలుషితం అవుతుండటాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పట్టణంలో ఎస్ఎఫ్ఐ విద్యాసంస్థల బంద్ నిర్వహించింది. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను ఇళ్లకు పంపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. నాయకులు బన్ని, శివ, నరేష్, కార్తిక్, సురేష్ పాల్గొన్నారు.

'ఫారూఖీ ధార్మిక సేవలు మరువలేం'



ప్రసంగిస్తున్న డాక్టర్ ముఫ్తి జియావుద్దీన్

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ యూనివర్సిటీ జామీయ నిజామియా ఫౌండర్ హజ్రత్ మహ్మద్ అన్వారుల్లా ఫారూఖీ అందించిన ధార్మిక సేవలను మరువలేమని ప్రముఖ ధార్మికవేత్తలు మౌలానా సయ్యద్ సఫీర్ అహ్మద్, మౌలానా డాక్టర్ ముఫ్తి జియావుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జామీయ మజీద్‌లో అన్వారుల్లా ఫారూఖీ రహెమతుల్లా అలై 110వ ఉర్సు వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జామీయ మజీద్‌లో శుక్రవారం రాత్రి ధార్మిక సభ నిర్వహించారు. ముందుగా హైదరాబాద్‌లోని మక్కా మజీద్ ఇమామ్ మౌలానా హాఫిజ్ మహ్మద్ రిజ్వాన్ పాల్గొని పవిత్ర ఖురాన్‌ను పఠిస్తారని ముఖ్యవక్తలుగా మతపెద్దలు పాల్గొని ప్రసంగించారు. అన్వారుల్లా ఫారూఖీ జామియ నిజామియాను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ధార్మిక విద్యను అందించినట్లు తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర గల ఈ యూనివర్సిటీలో చదివిన వేలాదిమంది ధార్మిక సేవలు చేస్తున్నట్లు తెలిపారు. సభలో మర్దాన్‌అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాఖ్‌షా ఖాద్రీ, మతపెద్దలు మహ్మద్ ఇస్మాయిల్, మొహిసిన్‌పాష ఖాద్రీ, మహ్మ ద్ ఇలియాజ్, మునీర్, ఖాజా ఫైజొద్దీన్, సయ్యద్ అమీనుద్దీన్‌ఖాద్రీ, గౌస్‌మొహియొద్దీన్, రఫీక్ పటే ల్, మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్ సనా, అబ్దుల్ జకీ తదితరులు పాల్గొన్నారు.

'తప్పుచేస్తే నోటీసులివ్వాలి'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కిందిస్థాయి ఉద్యోగులు తప్పుచేస్తే నోటీసులు ఇవ్వాలని, కాళ్లు మొక్కించడం ఏమిటని ఎస్ఎస్‌యూఐ పీయూ అధ్యక్షుడు వంశీ ప్రశ్నించారు. యూని వర్సిటీ ఓ ఉద్యోగి చేసిన చిన్నతప్పుకు యూనివర్సిటీ హాస్టల్‌లో ఓ కేర్‌టేకర్ ఉద్యోగి కాళ్లు పట్టుకునేలా వేధించడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ శనివారం ఎస్ఎస్ యూఐ నాయకులు పీయూ అధికారులకు ఫి ర్యాదు చేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడారు. ఉద్యోగితో కాళ్లు మొక్కించుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పీయూ అధికారులు ఎందుకు వారిని సమర్థిస్తున్నారో తెలియడం లేదన్నారు. రవీందర్, వినోద్‌కుమార్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పీయూ నెట్‌వర్క్ అబ్జర్వర్‌గా గౌస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ(పాలమూరు యూనివర్సిటీ) నెట్‌వర్క్ అబ్జర్వర్‌గా గౌస్ మోయినోద్దీన్‌ను నియమిస్తూ పీయూ వీసీ జీఎస్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయనకు ఉత్తర్వులను అందజేశారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

టచ్ ఆర్గనైజేషన్‌ను సందర్శించిన..

పాలమూరు యూనివర్సిటీ సోషల్‌వర్క్ విభా గం ఫస్టియర్ విద్యార్థులు టచ్ ఆర్గనైజేషన్‌ను శనివారం నిర్వహించారు. వినయ్ కుమార్ ఆ ధ్వర్యంలో అక్కడ నిర్వహించే ఆయా కార్యక్రమాలపై అవగాహన పొందారు. పర్వతాలు, అంజలి, ఆనంద్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన చాకలి మాసన్న అనారోగ్యంతో బాధపడుతూ చనియాడు. బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. రాకేష్, శ్రీనివాసులు, నాగ రాజు, నరేష్, కృష్ణయ్య, మంగమ్మ, నీలమ్మ ఉన్నారు.

అరెస్టులు చేస్తే అబద్ధాలు నిజాలు అవుతాయా?

మహమ్మదాబాద్: సీఎం సమావేశాన్ని అడ్డుకుంటారన్న నెపంతో బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేస్తే అబద్ధాలు నిజాలవుతాయా అని బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ ప్రశ్నించారు. శనివారం బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడంతో వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతులకు తగిన సమాధానాలు చెప్పాలని వారు డిమాండ్‌చేశారు. బీజేపీ నాయకులు నర్సింలు, హరిప్రసాద్, మల్లేష్, చంద్రశేఖర, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత కంఠస్థ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

దేవరకద్ర: గీత జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీవాణి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థాయిలో జరిగిన పోటీల్లో శ్రీవాణి శిశుమందిర ఉన్నత పాఠశాలకు చెందిన రాంచరణ్ మొదటి, సృజన రెండో బహుమతి సాధించారు. ద్వితీయ స్థాయిలో జరిగిన పోటీల్లో గుడిబండ యూపీఎస్‌కు చెందిన భవిత మొదటి, శ్రీవాణి నుంచి భవ్యశ్రీకి రెండో బహుమతి వచ్చింది. తృతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో మొదటి బహుమతి స్నిగ్ధరెడ్డి తపోవన్ స్కూల్, రెండో బహుమతి వైష్ణవి జడ్పీ ఉన్నత పాఠశాల లక్ష్మీపల్లికి వచ్చింది. చతుర్థ స్థాయిలో జరిగిన పోటీల్లో మొదటి బహుమతి లక్ష్మీపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తన, రెండో బహుమతి శ్రీలక్ష్మి సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ చెలిమెల, ఎంఈఓ బలరాం బహుమతులను అందజేశారు. హెచ్‌ఎంలు వసంత, సుధాకర్‌రెడ్డి, రామలింగం, శ్రీనివాస్, సుధాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత అన్నారు. శనివారం స్థానిక సర స్వతీ విద్యాపీఠం పాలమూరు జిల్లాస్థాయి ఖేల్‌కూద్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్లు చైతన్య, సతీష్, హెచ్‌ఎం సతీష్, అనంతరెడ్డి, రంగరాములు ఉన్నారు.

ఖేల్‌కూద్ పోటీలు విజయవంతం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ మైదానంలో శనివారం నిర్వహించిన సరస్వతీ శిశుమందిరాల జిల్లాస్థాయి ఖేల్‌కూద్ పోటీలు విజయవంతం అయ్యాయి. జిల్లాలోని వివిధ సరస్వతి శిశుమందిరాల నుంచి 300మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, ఉపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, సునీల్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో సరస్వతి విద్యాపీఠం పాలమూరు విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంతరెడ్డి పాల్గొని క్రీడల ప్రాధాన్యతను వివరించారు. వార్డు కౌన్సిలర్ సతీష్, పాఠశాల కార్యదర్శి నోముల కృష్ణయ్య, హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



మహమ్మదాబాద్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మహమ్మదాబాద్: విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యా బోధన చేయడం ఆనందంగాబోధించడంలో ఎంతో ఆనందం ఉంటుందని ఏటీఆర్ పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి తెలిపారు. శనివారం ఏటీఆర్ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారి బోధనలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంగా శివప్రసాద్, విద్యాశాఖ మంత్రిగా సాహితీ, క్రీడా మంత్రిగా ఆకాశ్, విద్యా కమిషనర్‌గా సుమలత, ఆర్‌జేడీగా హర్షిత, కలెక్టర్‌గా తేజ, డీఈఓగాఅశ్విని, ప్రధానోపాధ్యాయుడిగా ఐశ్వర్య పాత్రలు పోషించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో మాదిరి ఎన్నికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మండలంలోని మణికొండ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులతో మాదిరి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, ప్రజాస్వామ్యంపై అవగాహన అందరికీ అవసరమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పద్మమ్మ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. హెచ్‌ఎం కె.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలో మాదిరి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఓటుతో పాటు ప్రజాస్వామ్య విలువలు మెరుగుపడతాయన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, బి.నర్సప్ప, అన్వరుద్దీన్, కల్యాణి, ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



రుక్మిణిరెడ్డిని సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు

జడ్చర్ల టౌన్: తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా వ్యవహరించాలని హైదరాబాద్ కేంబ్రిడ్జ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రుక్మిణిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వాసవిగార్డెన్‌లో జరిగిన గీతాశ్రీ స్కూల్ పదో వార్షికోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పిల్లల ఆలోచనలను ప్రోత్సహించాలని, అపుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. హైదరాబాద్ ఐఈసీఈ చైర్మన్ ప్రశాంత్, హైదరాబాద్ ఐఐటీ ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఏర్పరచుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆ దిశగా గీతాశ్రీ విద్యార్థులు ముందంజలో ఉన్నారని కొనియాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌రెడ్డి, రాజేశ్వరి, వాసవి నర్సింహులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ



డైరెక్టర్ బి. శైలజ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

నారాయణపేట: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27, 28 తేదీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వికలాంగుల క్రీడా పోటీలలో జిల్లా దివ్యాంగ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో జిల్లా నుంచి జోసెఫ్, మౌనిక, ఆశమ్మ, జ్యోతి, నాగమ్మ, ఆంజనేయులు పాల్గొనగా జోసెఫ్ షాట్‌పుట్ బాలుర ఆర్థోపెడిక్ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించగా, సీనియర్ అంధుల రన్నింగ్, షాట్‌పుట్‌లో రెండో బహుమతులను నాగమ్మ గెలుచుకుంది. అలాగే ఆర్థోపెడిక్ జూనియర్ విభాగం క్యారంలో శిరిషా రెండో బహుమతి సాధించింది. శనివారం సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. శైలజ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సంక్షేమ అధికారి జయ, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ముక్కంటికి దీపార్చన



మక్తల్: కార్తీకమాసం సందర్భంగా పట్టణంలో ఉమమహేశ్వర ఆలయంలో ఆదివారం సాయంత్రం ముక్కంటికి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి సిద్ధరామయ్య తెలిపారు. పరమశివుడి దీపార్చన కార్యక్రమం ఉంటుందని భక్తులందరు పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ - మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి - జె. రమేష్ - 99486 98552
జడ్చర్ల - పి. అంజనేయులు - 80966 88450

సాక్షి - పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : జి. శివుడు, యాడ్స్ మేనేజర్ - 9951602929

రంజిత్ కుమార్ - 90102 34478
కేశవులు - 90105 22215
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797